క్లుప్తంగా

14 మంది విద్యార్థుల గైర్హాజరు

అంబాజీపేట: మండలంలోని మూడు కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓలు కాంద్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. అంబాజీపేటలో 152 మందికి 143, తొండవరంలో 159 మందికి 158, పుల్లేటికుర్రులో 191 మందికి 187 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. అంబాజీపేటలో 9, తొండవరంలో ఒకరు, పుల్లేటికుర్రులో నలుగురు విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని తెలిపారు.

చిన్నారులకు అన్న ప్రాసనలు



సీమంతాలు, అన్నప్రాసనలు నిర్వహిస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మోరి సెక్టార్ ఉయ్యూరువారి మెరక అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసనలు, సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సూపర్‌వైజర్ చంద్రకళ, మహిళా పోలీసు సూజన్, ఏఎస్ఎం మీనాకుమారి, స్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీ మహాజన సభ

మలికిపురం: స్థానిక పీఏసీఎస్ సంఘ మహాజన సభ బుధవారం సొసైటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ చెల్లుబోయిన బుచ్చియ్య అధ్యక్షతన జరిగింది. అజెండా ప్రకారం సంఘ జమా ఖర్చులను సీఈఓ ప్రవేశపెట్టారు. వీటిపై సభ్యులు చర్చించిన అనంతరం ఆమోదించారు. సంఘంలో వ్యాపార లావాదేవీలు పెంచేందుకు ఎక్కువ మంది రైతులు రుణాలు తీసుకోవాలని, ఫిక్స్‌డ్ డిపాజిట్లను పెంచి సంఘ అభివృద్ధికి సహకరించాలని చైర్‌పర్సన్ బుచ్చియ్య కోరారు. కాగా రైతు నేస్తం పథకంలో ఎకరాకు రూ.8 లక్షల రుణాన్ని రైతులకు ఇచ్చేందుకు డీసీసీబీ నిర్ణయించినట్టు సీఈఓ చెప్పారు.

పోషకాహారంతోనే శిశువు ఆరోగ్యం



గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అయినవిల్లి: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా శిశువుల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రామలక్ష్మి అన్నారు. ఎస్.మూలపాలెం సెక్టార్‌లోని తొత్తరమూడి, శానపల్లిలంక గ్రామాల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుపోషణ దివస్ నిర్వహించారు.

ఘనంగా కల్పవృక్ష, సర్వభూపాల వాహనోత్సవాలు



రావులపాలెంలో స్వామివారిని కల్పవృక్ష వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాల్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం హనుమత్ హోమం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చనం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని కల్పవృక్ష వాహనంపై గోవింద మాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు వాడపల్లి కమలనాథ్ ఆచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిపారు. రాత్రికి స్వామివారికి సర్వభూపాల వాహనోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిర్ణీత వ్యవధిలో చిన్నారులకు టీకాలు

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు, ఆలమూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యారోగ్య సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారుల పర్యవేక్షణలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు వైద్య సేవలను పర్యవేక్షించారు. పెదపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్శిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలు, గర్భిణులకు ఇంజెక్షన్లు ఇచ్చారు.

సాగునీటి సమస్యకు చెక్

- చానళ్లలో తూడు, వ్యర్థాల తొలగింపు
- డ్రెయిన్లలో క్రాస్‌బండ్ల ఏర్పాటు



బిళ్లకుర్రు వద్ద జేసీబీతో ఓల్డ్ వాడపాలెం చానల్‌లో చేపట్టిన పూడికతీత, చెత్త తొలగింపు పనులు

కొత్తపేట: ప్రస్తుత రబీ (దాళ్వా) పంటను సాగునీటి సమస్య నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంది. దాంతో చానళ్ల శివారు భూములకు పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుంది. ఓ వైపు గోదావరిలో వాటర్ లెవెల్ అంతంత మాత్రంగా ఉన్నా సక్రమంగా సరఫరా చేయడం, మరోవైపు దాళ్వా పంట నష్టపోకుండా గట్టెక్కించాల్సిన పరిస్థితి. ఇటీవల ఈ విషయాన్ని స్థానిక రైతులు, రైతు నాయకులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరావుతో సమీక్షించారు. ఆ మేరకు సీఈ క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించి, సాగునీటికి రైతులు పడుతున్న ఇబ్బందులను, చానళ్లలో సాగునీటి సరఫరాకు అడ్డంకిగా ఉన్న తూడు, వ్యర్థాల తొలగింపు, డ్రెయిన్లలో నీరు కూడా సద్వినియోగం చేసుకునేలా క్రాస్‌బండ్ల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వివరించారు. దానిపై కలెక్టర్ శుక్లా స్పందించి సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఏ మండలంలో చానళ్లలో సమస్య ఉందో.. ఆయా మండలాలకు రూ.లక్ష వరకు ప్రత్యేక నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. ఇరిగేషన్, డ్రెయిన్ల శాఖల అధికారులు ఆయా పనులు చేపట్టి బిల్లులు తహసీల్దార్లకు సమర్పిస్తే, నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ఆ మేరకు జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో పనులు చేపట్టారు. దానిలో భాగంగా బొబ్బర్లంక-ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువపై వాడపాలెం లాకుపైన, మండలంలోని వాడపాలెం ఓల్డ్ చానల్‌లో రూ.30 వేలతో తూడు, వ్యర్థాల తొలగింపు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. అలాగే బొబ్బర్లంక-అమలాపురం ప్రధాన పంటకాలువపై పలివెల లాకుపైన అంబాజీపేట చానల్ ద్వారా సాగవుతున్న వరి చేలకు అవిడి-గంటిపెదపూడి డ్రెయిన్ నీటి సరఫరాకు రూ.65 వేలతో క్రాస్ బండ్ ఏర్పాటు చేశారు. వంతుల వారీ విధానంలో అన్ని ప్రాంతాల వరి ఆయకట్టుకు సాగునీరు సమంగా సరఫరా చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తగినంత నీటి మట్టం కడుతున్నారు.



అవిడి డ్రెయిన్‌పై ఏర్పాటు చేసిన క్రాస్‌బండ్

దాళ్వా పంటకు అవసరమైన సాగునీటి సరఫరా



ప్రస్తుత దాళ్వా వరి పంటకు అవసరమైన సాగునీరు సరఫరాకు చర్యలు తీసుకున్నాం. ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరావు ఇటీవల స్వయంగా పరిశీలించిన మీదట, కలెక్టర్ ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో, తూడు, వ్యర్థాల తొలగింపుతో చానల్ శివారు భూములకు సాగునీరు సరఫరా చేస్తున్నాం. అలాగే క్రాస్‌బండ్లతో డ్రెయిన్లలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. వంతుల వారీ విధానంలో వాడపాలెం లాకు పైన కొత్తపేట, వాడపాలెం, బిళ్లకుర్రు భూములకు నీరు సరఫరా చేస్తున్నాం. ఆయా ప్రాంతాల రైతులు సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– వి.నవీన్‌కుమార్, ఏఈ, కొత్తపేట ఇరిగేషన్ సెక్షన్

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

వైఎస్సార్ సీపీ పి.గన్నవరం అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు



ఊడిమూడిలో విప్పర్తిని సత్కరిస్తున్న నాయకులు

పి.గన్నవరం: దేశంలో ఎక్కడా జరగని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేశారని, ఆయన్ను మళ్లీ గెలిపించేందుకు కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఊడిమూడి గ్రామంలో బుధవారం జరిగిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదలకు న్యాయం జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలవాలన్నారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో విప్పర్తిని సత్కరించారు. పార్టీ నాయకులు సాధనాల రమేష్, అడ్డాల రవీంద్రనాథ్ ఠాగూర్, కొల్లు రాంబాబు, నేలపూడి గంగరాజు, కడలి వెర్రియ్య, వెంకన్నబాబు, మేడిశెట్టి నాగేశ్వరరావు, యన్నాబత్తుల ఆనంద్, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

జి.పెదపూడి గ్రామంలో ఉన్న వేంకటేశ్వర స్వామి వారిని పార్టీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు దర్శించుకుని, పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, అడ్డగళ్ల వెంకటసాయిరామ్, జల్లి శ్రీను, కొక్కిరి రవికుమార్, అడ్డగళ్ల శ్రీను, పప్పుల కర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం సాధ్యం

పార్టీ రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు



గెద్దాడలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గొల్లపల్లి సూర్యారావు

మామిడికుదురు: సచివాలయ వ్యవస్థ ద్వారా ఎన్నో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం సాధ్యమవుతుందని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన గెద్దాడ గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రవేశపెట్టి, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందాలన్నా, వలంటీర్ వ్యవస్థ కొనసాగాలన్నా మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు పొరపాటు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. జన్మభూమి కమిటీలు కావాలో, వలంటీర్ వ్యవస్థ కావాలో ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ గుబ్బల గీతాభవాని, ఎంపీటీసీ జవ్వాది పద్మావతి, పార్టీ నేతలు బొలిశెట్టి భగవాన్, ఎండీవై షరీఫ్, సూరిశెట్టి బాబి, జిల్లెళ్ల శ్రీను, గూటం రాజేష్, వెంకటేష్, బొక్కా శ్రీరామ్మూర్తి, నేదూరి రాంబాబు, గెద్దాడ నాగరాజు, మధుర కోటేశ్వరరావు, జవ్వాది సత్తిబాబు, చిట్టూరి కాశీ ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఎమ్మెల్యే చిట్టిబాబు



మొండెపులంకలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మొండెపులంక గ్రామంలోని బొంతువారిపేటలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర మాలల జేఏసీ కో-కన్వీనర్ కోట రామ్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేడ్కర్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విగ్రహ దాత బొంతు బాబూరావును చిట్టిబాబు, పలువురు నాయకులు సత్కరించారు. నాయకులు చిల్లే మోహనరావు, యల్లమెల్లి నాగేశ్వరరావు, మానుకొండ నాగేంద్ర, మానుకొండ సుబ్బారావు, గుర్రం విజయకుమార్, తోలేటి నర్సింహరావు, కొల్లాటి వెంకటరావు, ఇంజే వెంకట్రావు, మానుకొండ జయానంద తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న దంపతులకు రూ.18 వేల ఆర్థిక సాయం అందజేసినట్టు అక్షయ సేవా సంస్థ ప్రతినిధులు బుధవారం తెలిపారు. కొత్తపేట శివారు పలివెల గ్రామానికి చెందిన కామాడి త్రిమూర్తులు ఆయన భార్య దుర్గకు గతంలో మెదడు సంబంధ ఆపరేషన్లు జరిగాయి. తర్వాత త్రిమూర్తులుకు కుడిచేయి పని చేయడం లేదు, ఆయన భార్యకు కంటిచూపు పోయింది. వీరి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. వైద్యానికి సాయం చేయాలని అక్షయ సేవా సంస్థ సభ్యులను కోరడంతో, వారు ఆర్థిక సాయం అందజేశారు.

సొసైటీ బ్యాంకు చైర్‌పర్సన్‌గా మారిశెట్టి



ఆత్రేయపురం: ఆత్రేయపురం సొసైటీ బ్యాంకు చైర్‌పర్సన్‌గా బుధవారం మారిశెట్టి సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. చైర్‌పర్సన్‌గా ఉన్న పీఎస్ రాజు రాజీనామా చేయడంతో, మారిశెట్టి బాధ్యతలు స్వీకరించారు.

యువత భవిష్యత్తుకు సీఎం జగన్ పెద్దపీట

వైఎస్సార్ సీపీ రాజోలు అభ్యర్థి గొల్లపల్లి



మలికిపురంలో పార్టీలో చేరిన యువకులతో గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి యువత బంగారు భవిష్యత్తుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై, మండలానికి చెందిన కొత్త యువ ఓటర్లు 30 మంది పార్టీలో చేరారు. వీరికి గొల్లపల్లి పార్టీ కండువాలను వేసి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ, తమ తల్లిదండ్రులు వైఎస్సార్ సీపీ అభిమానులని, వారిని స్ఫూర్తిగా తీసుకుని పార్టీలో చేరామన్నారు. అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు, రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుకు ఓట్లు వేసి గెలిపిస్తామన్నారు. రాష్ట్రంలో సీఎంగా మరోసారి జగనన్నను అధికారంలోకి తెచ్చేందుకు సమష్టి కృషి చేస్తామన్నారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రాయవరం: ఎన్నికల నియమావళిని అధికారులు మండలంలో కఠినంగా అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామంలో అన్ని పార్టీలకు సంబంధించి బ్యానర్లు, వాల్ పోస్టర్లను ఇప్పటికే తొలగించారు. ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ నిఘా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా బుధవారం రాయవరం ప్రధాన రహదారిలో మండల స్థాయి అధికారులు, పోలీసులు ఉమ్మడిగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎవరైనా అధిక మొత్తంలో నగదు కలిగి ఉంటే దానిని సీజ్ చేస్తామని, సరైన ఆధారాలు కలిగి ఉంటే సంబంధిత యజమానులకు అప్పగిస్తామన్నారు. ప్రతి తనిఖీని ఎప్పటికప్పుడు వీడియో షూటింగ్ ద్వారా రికార్డు చేస్తున్నారు. తనిఖీల్లో ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, పోలీసులు పాల్గొన్నారు.

రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన



చిలకలపాడులో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆలమూరు: మడికి శివారు చిలకలపాడులో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేవతామూర్తుల విగ్రహాలను దర్శించుకుని, వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన జరిగింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ యు.లక్ష్మిమౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే

రావులపాలెం: పొడగట్లపల్లి గ్రామంలో చిన రామాలయం వీధిలో నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు బుధవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరిలో అధిక దిగుబడి సాధించాలి



ఆలమూరులో ఆర్బీకేను సందర్శించిన బోసుబాబు

ఆలమూరు: సాగుబడిలో వరి రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు పలు సూచనలు అందజేశారు. పంట కోత కోసే దశకు వచ్చినందున ప్రస్తుతం రైతులు అవలంబిస్తున్న విధానాలపై ఆరా తీశారు. వేసవిలో నీటి ఎద్దడి కారణంగా వచ్చే సమస్యలపై ఆందోళన చెందవద్దన్నారు, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ సమన్వయంతో రైతుల సమస్యలను పరిష్కరిస్తాయన్నారు. రబీ సాగులో ససరక్షణ చర్యలు పాటించడం ద్వారా చీడపీడలు నివారించవచ్చన్నారు. ఈ సీజన్‌లో ఎకరాకు సుమారు 50–55 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వ్యవసాయ శాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సిబ్బంది పాటించాల్సిన నియమాలను వివరించారు. ఏడీఏ కె.నాగేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి సోమిరెడ్డి లక్ష్మీలావణ్య, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

అంబాజీపేట: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నందున పన్ను వసూళ్లను నూరు శాతం పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎల్పీఓ పి.బొజ్జరాజు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందితో ఇంటి పన్నుల వసూళ్లపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్పీఓ బొజ్జరాజు మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి ఇంటి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పన్ను వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి, నూరు శాతం వసూలు జరిగేలా చూడాలన్నారు. ప్రజలు కూడా ఇంటి పన్నులు చెల్లించి సహకరించాలన్నారు. ప్రజలు చెల్లించే పన్నులతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. చట్ట ప్రకారం వ్యాపార సముదాయాలు, ఇతర అంశాలపై రాజకీయ నాయకుల ప్రచార బోర్డులు తొలగించాలని ఆదేశించారు. కోడ్ కాండక్ట్ అమల్లోకి వచ్చినందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ బి.మమత, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

వైభవంగా గణపతి విగ్రహ ప్రతిష్ఠ



పోతాయిలంకలో గణపతి విగ్రహానికి పూజ చేస్తున్న భక్తులు

అంబాజీపేట: మాచవరం శివారు పోతాయిలంక గ్రామంలో ఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద సిద్ధి గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ఠను బుధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు కారుపర్తి తేజాశర్మ పర్యవేక్షణలో మట్టపర్తి వెంకటేశ్వరరావు, కనకదుర్గ, వీరి కుమారులు శ్రీధనరాజ్, పూజా కైరవ్‌రాజ్, సాయిరామ్, సాయిరత్నశ్రీ దంపతులతో పాటు, స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమం, పుణ్యాహవచనం, విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద అన్న సమారాధన జరిగింది.

పెద్దింట్లమ్మ సన్నిధిలో కుంకుమార్చనలు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు తోటమెరకలో కొలువు తీరిన పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చనలు జరిగాయి. భారీగా హాజరైన మహిళలకు ఆలయ కమిటీ పూజా సామగ్రిని ఉచితంగా అందించింది. వేద మంత్రాల నడుమ అమ్మవారికి పలు ప్రత్యేక పూజలు జరిపించారు. నెల రోజుల పాటు జరిగే అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పూజల అనంతరం అమ్మవారి కల్యాణం భక్తుల కోలాహలం నడుమ జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. గురువారం అమ్మవారి ప్రభ ఊరేగింపు, ఈ నెల 26న అమ్మవారి జాతర జరుగుతాయి.

రామలింగేశ్వరునికి వార్షికోత్సవ పూజలు

మామిడికుదురు: మామిడికుదురు గ్రామంలో కొలువుతీరిన పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం 11వ వార్షికోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. రామలింగేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి కుంకుమార్చనలు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష బిల్వార్చనలో పలువురు భక్త దంపతులు పాల్గొన్నారు.



మాకనపాలెంలోని సత్యనారాయణ స్వామి ఉత్సవమూర్తులు

నారసింహ సుదర్శన హోమం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమానికి భక్తులు పోటెత్తారు. మనోవాంఛా ఫలసిద్ధి కోసం, సర్వగ్రహ దోష నివారణకు భక్తులు సుదర్శన హోమంలో పాల్గొని, స్వామిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. స్వామివారి సన్నిధిలో నవ బుధవార, నవ ప్రదక్షిణ దీక్ష చేస్తే లక్ష్మీనృసింహస్వామి కోరిన కోర్కెలు తీరుస్తాడని అర్చకులు తెలిపారు.

సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం

మామిడికుదురు: మాకనపాలెంలోని అనంతలక్ష్మి, భూదేవి సమేత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భక్త దంపతులు సలాది వెంకటేశ్వరరావు, నాగమణి.. అనంతలక్ష్మి, శ్రీదేవి అమ్మవార్లతో పాటు, సత్యనారాయణ స్వామి వార్లను పెళ్లి కుమార్తెలు, పెళ్లి కుమారుడిగా అలంకరించారు. స్వామివారి 72వ దివ్య తిరు కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భారీగా విద్యుత్ అలంకరణలతో ఆలయాన్ని తీర్చిదిద్దారు. ఈ నెల 25 వరకూ కల్యాణోత్సవాలు జరుగుతాయి. గురువారం నుంచి ఉదయం వ్రతాలు, అభిషేకాలు, మొక్కులు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది. గురువారం రాత్రి 12 గంటలకు స్వామివారి దివ్య తిరు కల్యాణం జరుగుతుందని పేర్కొంది.

కిక్కిరిసిన సిద్ధి వినాయక ఆలయం



స్వామివారి సన్నిధిలో భక్తుల సందడి

అయినవిల్లి: ఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయం బుధవారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి దర్శనం కోసం ఉదయం నుంచి భక్తులు క్యూలైన్‌లో నిలబడ్డారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో శ్రీలక్ష్మీగణపతి హోమం జరిపారు. అలాగే నల్లచెరువు వేంకటేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.



తోటమెరకలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



మామిడికుదురులో వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్త దంపతులు



అంతర్వేది ఆలయంలో సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

వరుణుడి కరుణ..!



కె.గంగవరంలో కారుమబ్బులతో నిండిన ఆకాశం

కె.గంగవరం: సూర్యుడి ప్రతాపంతో అల్లాడుతున్న పల్లె ప్రజానీకం బుధవారం కురిసిన వర్షం కాస్తంత సేదతీరారు. ఉదయం నుంచీ ఆకాశం నల్లని మబ్బులతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. పచ్చని కొబ్బరి చెట్ల మీదుగా మేఘావృతమైన నింగి ప్రజలను కనువిందు చేసింది. ఎండవేడితో సతమతమవుతున్న ప్రజలకు చల్లని గాలులు ఊరటనిచ్చాయి. చిన్నారులు కేరింతలు కొడుతూ చల్లదనాన్ని ఆస్వాదించారు. సాయంత్రం వరకూ ఈదురుగాలులతో కూడిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ అకాల వర్షానికి రైతులు కలవరపడ్డారు. పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వారంటున్నారు. ఇటీవల కొన్ని గ్రామాల్లో తెగుళ్లు, దోమల నివారణకు మందులను పిచికారీ చేశారు. ఈ వర్షం కారణంగా ఆ మందులు వృథా అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

కాజులూరు: కాజులూరు మండల గ్రామాల్లో బుధవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచే భానుడు ఉగ్రరూపం దాల్చగా, మధ్యాహ్నం ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు మొదలయ్యాయి.